1st Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 2 సంచిక : 328 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 26 నవంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 328 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 26 November 2025 PAGES : 8 PRICE : 3/-

## ఇంకెంతకాలం.. ఏదో ఒక నిర్ణయం తీసుకోండి: అధిష్ఠానానికి సిద్ధూ సూచన



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 25)
కర్ణాటకలో కొంతకాలంగా సీఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. నవంబర్‌లో ఆ మార్పు ఉండొచ్చన్న వార్తలు.. ఈ నెల ముగింపునకు వచ్చినా ఆగడం లేదు. ఎడతెగకుండా వస్తోన్న ఊహాగానాలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోసారి స్పందించారు. -మిగతా 2లో

## శాంతిని కాంక్షిస్తాం.. కానీ, భద్రతపై రాజీపడం: ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 25)
తమ ప్రభుత్వం శాంతిని కాంక్షిస్తోందని, కానీ.. దేశ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్ దీనికి అతిపెద్ద ఉదాహరణ అని పేర్కొన్నారు. సిక్కు గురువు గురు తేగ్ బహదూర్ 350వ బలిదాన దినం సందర్భంగా హరియాణాలోని కురుక్షేత్రలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పేరిట -మిగతా 2లో

## హక్కుల గురించి మాట్లాడతారు కానీ... బాధ్యతల గురించి ఆలోచించరు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 25)
మంగళగిరి తన కుటుంబంలా మారిపోయిందని లోకేశ్ వ్యాఖ్య
రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి అందరూ మాట్లాడతారని, కానీ బాధ్యతల గురించి ఆలోచించరని, హక్కులతో పాటు బాధ్యతలు కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరిలోని మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని కూర్మాల శ్రీ కనకపుట్లమ్మ, రేపు జరగనున్న 'స్టూడెంట్ మాక్ అసెంబ్లీ'కి ఎంపికైన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు విద్యార్థినిని, ఆమె కుటుంబ సభ్యులను ఉండవల్లిలోని తన నివాసానికి పిలిపించి మాట్లాడారు. -మిగతా 2లో

# ఏపీలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 25)
ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు నిర్ణయించారు. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి పెరగనుంది. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం ఏర్పాటుకు సీఎం నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల పునర్విభజనపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న మూడు జిల్లాలు పరిశీలిస్తే.. రంపచోడవరం నియోజకవర్గంలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో రంపచోడవరం, దేవీపట్నం, వైరామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు




ఉండనున్నాయి. ఇక చింతూరు డివిజన్‌లో యెటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలను చేర్చారు.
యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోని మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లతో కొత్త జిల్లాగా మార్కాపురం ఏర్పాటు కానుంది. మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లోని యర్రగొండపాలెం, పుల్లల చెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తుర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, అలాగే కనిగిరి డివిజన్ లోని హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు కొత్తజిల్లాలో ఉండనున్నాయి.మదనపల్లి, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లోని మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా మదనపల్లి జిల్లా ఏర్పాటు కానుంది. మదనపల్లి రెవెన్యూ డివిజన్ లోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకల చెరువు, పెదమండ్యం, కురబలకోట, పీటీ సముద్రం, బీరొంగి కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలు, అలాగే పీలేరు డివిజన్ లోని సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారి పల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉండనున్నాయి. శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్‌లోని నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కలిపేందుకు మంత్రుల కమిటీ చేసిన సిఫారసుకు సీఎం ఆమోదం తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని పాయకరావు పేట- యలమంచిలి నియోజకవర్గాల్లోని మండలాలతో కొత్తగా నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. కాకినాడ డివిజన్‌లోని సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లో విలీనం -మిగతా 2లో

## ముంచుకొస్తున్న మరో తుపాను... రైతులను అప్రమత్తం చేసిన అచ్చెన్నాయుడు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 25)
రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం, వాయుగుండంగా మారి రానున్న 48 గంటల్లో తుపానుగా బలపడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

పంట నష్టం జరగకుండా రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ముఖ్యంగా వరి కోతలు పూర్తిచేసిన రైతులు, తమ ధాన్యాన్ని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు ప్రభుత్వం తరఫున రైతులకు ఉచితంగా టార్పలిన్ పట్టాలు పంపిణీ చేస్తున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. రైతులు జిల్లా యంత్రాంగాన్ని -మిగతా 2లో


## త్వరలో భారత్-కెనడా మధ్య యురేనియం డీల్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 25)
వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఇంధనం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించే దిశగా భారత్-కెనడా చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులోభాగంగా ఇరుదేశాల మధ్య 2.8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.25వేల కోట్లు) యురేనియం ఒప్పందం చేసుకున్నట్లు కెనడా మీడియా వర్గాలు వెల్లడించాయి. త్వరలో ఖరారు కానున్న ఈ ఒప్పందం 10 ఏళ్ల పాటు అమల్లో ఉంటుందని తెలిపాయి. రెండు దేశాల మధ్య విస్తృత పౌర అణు సహకార ప్రయత్నంలో భాగంగా కెనడాకు చెందిన కామెకో కార్ప్ అనే సంస్థ ఈ సామగ్రిని భారత్‌కు సరఫరా చేయనున్నట్లు సమాచారం. 2015లో కెనడాతో భారత్ యురేనియం -మిగతా 2లో

## ఏపీలో మూడు రోజుల పాటు 'ఉద్భవ్-2025'

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 25)
'ఉద్భవ్-2025' పేరుతో డిసెంబర్‌లో ఏపీలో జాతీయ స్థాయి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్, లోగోను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారి జాతీయ స్థాయి ఉద్భవ్-2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. -మిగతా 2లో






## సవాల్ విసరాలని చూస్తే.. భాజపా పునాదులు కదిలిస్తా: మమతా బెనర్జీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 25)
భాజపా తనతో రాజకీయంగా పోరాడలేదని, తనను ఓడించడం సాధ్యం కాదని పశ్చిమ బెంగాల్ -మిగతా 2లో

## డిసెంబరు 6 నుంచి అమెరికాలో నారా లోకేశ్ పర్యటన... 8 వేల మందితో భారీ సభ!

### డిసెంబర్ మొదటి వారంలో మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన
### ఏపీకి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం


(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 25)



ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. డిసెంబర్ మొదటి వారంలో ఆయన అమెరికాలో పర్యటించనున్నారు. రాష్ట్రంలోకి కొత్త పరిశ్రమలను ఆహ్వానించడంతో పాటు, ప్రవాసాంధ్రులను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.ఖరారైన షెడ్యూల్ ప్రకారం, డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు లోకేశ్ అమెరికాలో పర్యటిస్తారు. పర్యటనలో -మిగతా 2లో

## ఆపరేషన్ సిందూర్‌లో కృష్ణుడి సందేశాన్నే అనుసరించాం: రాజ్‌నాథ్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 25)
ప్రతీకారంతోనో, అత్యాశతోనో కాకుండా ధర్మ సంస్థాపన కోసం యుద్ధం చేయాలని పాండవులకు శ్రీకృష్ణ పరమాత్ముడు బోధించిన విధంగానే ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టామని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. ధర్మబద్ధమైన మార్గంలో పయనించేవారు ఎప్పుడూ భయపడకూడదని అర్జునుడికి శ్రీకృష్ణుడు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.



ప్రబోధించడం ద్వారా మాత్రమే కాకుండా చర్యలతో ధర్మాన్ని రక్షించాలని గీతలో చెప్పిందే తాము ఆచరించామని చెప్పారు. కురుక్షేత్ర విశ్వవిద్యాలయం, విదేశీ వ్యవహారాల శాఖల ఆధ్వర్యంలో సోమవారం హరియాణాలోని కురుక్షేత్రలో జరిగిన '10వ అంతర్జాతీయ భగవద్గీత సదస్సు'లో ఆయన ప్రసంగించారు.

### మరపురాని రీతిలో బుద్ధి చెప్పాం

"పహల్గాం ఘటన.. శాంతికాముక భారత్‌కు సవాల్ విసిరింది. హుందాతనం మన బలహీనత అని ఉగ్రవాదులు, వారి పోషకులు భావించారు. -మిగతా 2లో

## సవాల్ విసరాలని చూస్తే.. భాజపా పునాదులు కదిలిస్తా: మమతా బెనర్జీ

ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. బెంగాల్‌లో తనకు సవాల్ విసరాలని చూస్తే.. దేశవ్యాప్తంగా ఆ పార్టీ పునాదులను కదిలిస్తానని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' కు వ్యతిరేకంగా బన్‌గావ్‌లో నిర్వహించిన ర్యాలీలో ఈ మేరకు ప్రసంగించారు. ఎన్నికల సంఘం ఏ మాత్రం నిష్పాక్షికంగా పనిచేయడం లేదని, అది భాజపా కమిషన్‌గా మారిందని ఆరోపించారు. ఎస్ఐఆర్ కారణంగానే బిహార్ ఎన్నికల ఫలితాలు ఆ విధంగా వచ్చాయని, అక్కడ భాజపా ఆటను ప్రతిపక్షాలు అంచనా వేయలేకపోయాయని దీదీ తెలిపారు. ఒకవేళ అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమైతే.. భాజపా పాలిత రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. అంటే.. 'డబుల్ ఇంజిన్' సర్కారు రాష్ట్రాల్లో చొరబాటుదారులు ఉన్నట్లు ఆ పార్టీ అంగీకరిస్తోందా? అని అన్నారు.

**ఆర్మీకి మతంతో సంబంధం లేదు: సుప్రీం కోర్టు**

రాష్ట్రంలో మతువా మెజారిటీ ప్రాంతాల్లోని ఓటర్లు 'సీఏఏ' కింద తమను తాము విదేశీయులుగా ప్రకటించుకుంటే వెంటనే ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లు తొలగిపోతాయన్నారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా బయటకు వచ్చిన తర్వాత.. ఈసీ, భాజపా సృష్టించిన గందరగోళాన్ని ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను రెండు, మూడేళ్లపాటు నిర్వహిస్తే సహకరిస్తామని చెప్పారు.

**హెలికాప్టర్ రద్దు.. మండిపడిన దీదీ**

తొలుత హెలికాప్టర్ ద్వారా బన్‌గావ్‌కు చేరుకునేందుకు దీదీ సిద్ధం కాగా.. ఆ ప్రణాళిక రద్దయింది. దీంతో కోల్‌కతా నుంచి ఆమె రోడ్డు మార్గంలో ఇక్కడికి చేరుకున్నారు. చివరి క్షణంలో హెలికాప్టర్ ప్రయాణం రద్దు కావడం వెనుక భాజపా హస్తం ఉందని ఆమె ఆరోపించారు. ఆ పార్టీ తనను ఇరుకున పెట్టలేదని, తనతో ఆటలాడొద్దని హెచ్చరించారు. అయితే.. గడువు ముగిసిన లైసెన్స్‌తో ఆ హెలికాప్టర్‌ను నడుపుతున్నట్లు గుర్తించామని, దీంతో రద్దు చేయాల్సి వచ్చిందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

## డిసెంబరు 6 నుంచి అమెరికాలో నారా లోకేశ్ పర్యటన... 8 వేల మందితో భారీ సభ!

భాగంగా తొలిరోజు డిసెంబర్ 6న డల్లాస్‌లో 'తెలుగు కమ్యూనిటీ విత్ నారా లోకేశ్' అనే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్ వంటి నగరాల్లోనూ పర్యటించి పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. ఈ పర్యటనలో భాగంగా డల్లాస్‌కు సమీపంలోని గార్లాండ్‌లో ఉన్న కర్టిస్ కల్వెల్ సెంటర్‌లో ఒక భారీ సభను నిర్వహించనున్నారు. దాదాపు 8 వేల మంది ప్రవాసాంధ్రులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని, కెనడా నుంచి కూడా పలువురు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, పెట్టుబడులతో భాగస్వాములు కావాలని లోకేశ్ ఈ సభలో ప్రవాసాంధ్రులను కోరనున్నారు. టెక్, ఐటీ రంగాల్లో అవకాశాలు, యువ నాయకత్వం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో రూ. 13 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు సాధించినట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ స్ఫూర్తితోనే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు తాజా పర్యటన చేపడుతున్నట్లు తెలుస్తోంది.

## ఏపీలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం

చేసేందుకు ఆమోదం తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, మండలాలను రాజమహేంద్రవరం డివిజన్‌లో కలపాలని నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలాన్ని ఇక నుంచి వాసవీ పెనుగొండ మండలంగా పేరు మార్చనున్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపనున్నారు. దీంతో పాటు అద్దంకి, దర్శి నియోజకవర్గాల్లోని మండలాలను కలుపుతూ కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో ఉన్న మర్రిపూడి, పొన్నలూరు మండలాలను కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయనున్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూర్, సైదాపురాలను తిరుపతి జిల్లా గూడురు డివిజన్‌లో విలీనం చేయనున్నారు. పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యంను చిత్తూరు డివిజన్‌లో కలపనున్నారు. సదుం, సోమల, పీలేరు, గుర్రం కొండ, కలకడ, కేబీ పల్లి, కలికిరి, వాల్మీకి పురం మండలాలతో పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. పలమనేరు డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరు మండలాలను మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయనున్నారు. కడప జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్ధవటంలను రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరను కొత్త రెవెన్యూ

**మొదటి పేజీ తరువాయి**

డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు. కదిరి డివిజన్ లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయనున్నారు. పుట్టపర్తి డివిజన్‌లో ఉన్న గోరంట్ల మండలాన్ని పెనుకొండ డివిజన్‌లో కలపనున్నారు. నంద్యాల జిల్లా డోన్ రెవెన్యూ డివిజన్ లోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల నంద్యాల డివిజన్‌లోని సంజామల, కొలిమిగుండ్ల మండలాలతో కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది.

## త్వరలో భారత్-కెనడా మధ్య యురేనియం డీల్

ఒప్పందం చేసుకున్న సమయంలోనూ కామెకో నుంచి భారత్ యురేనియం దిగుమతి చేసుకుంది. జీ-20 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య నిలిచిపోయిన వాణిజ్య చర్చలు, దీర్ఘకాల పౌర అణు సహకారాన్ని పునఃప్రారంభించడానికి వారు అంగీకరించారని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. అందులోభాగంగానే యురేనియం దిగుమతిపై చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపింది. భారత్, కెనడాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలను తిరిగి ప్రారంభించడానికి ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్లకు పెంచాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నాం: కెనడా మంత్రి అనితా ఆనంద్‌భారత్‌తో దౌత్యం విషయంలో తమ ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకువేస్తున్నట్లు సీబీసీ న్యూస్ ఇంటర్వ్యూలో కెనడా మంత్రి అనితా ఆనంద్ వెల్లడించారు. జస్టిన్ ట్రూడో హయాంలో ఇరుదేశాల సంబంధాలు దెబ్బతిన్నాయని.. ప్రస్తుతం తమ ప్రభుత్వం భారత్‌తో సంబంధాలను జాగ్రత్తగా ముందుకుతీసుకెళ్లడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మొదటి దశలో బంధాలను పునరుద్ధరించడం, రెండో దశలో హైకమిషనర్ల పరస్పర నియామకం, అనంతరం ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన ఉన్నతస్థాయి చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు.

## ఏపీలో మూడు రోజుల పాటు 'ఉద్భవ్-2025'

"డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో పోటీలు వైభవంగా నిర్వహిస్తున్నాం. 22 రాష్ట్రాల నుంచి 1800 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. కేఎల్ యూనివర్సిటీలో 12 వేదికలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తాం" అని సంధ్యారాణి తెలిపారు.

## ముంచుకొస్తున్న మరో తుపాను... రైతులను అప్రమత్తం చేసిన అచ్చెన్నాయుడు

సంప్రదించి వాటిని పొందవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. సముద్రం అలజడిగా ఉన్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే వేటకు వెళ్లిన వారు వెంటనే తీరానికి తిరిగి రావాలని ఆదేశించారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## హక్కుల గురించి మాట్లాడతారు కానీ... బాధ్యతల గురించి ఆలోచించరు

మంగళగిరి బీఆర్ నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శ్రీ కనకపుట్లమ్మ, పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఈ గౌరవాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా యువశక్తి ప్రాధాన్యత గురించి తరచూ చెబుతుంటారు. రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించాలనే ఆలోచనను సీఎం గారితో చర్చించి నిర్ణయించాం" అని తెలిపారు.

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని లోకేశ్ వివరించారు. "అమ్మకు చెప్పలేని పనులు చేయకూడదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు నిన్నటి విలువల విద్యాసదస్సులో చక్కగా చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తాం. విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.

ప్రతి ఏటా స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తామని, కనకపుట్లమ్మను చూసి మరో పది మంది విద్యార్థులు స్ఫూర్తి పొందుతారని అన్నారు. ఈ సందర్భంగా, "రేపటి మాక్ అసెంబ్లీలో మాకేమైనా సలహాలు, సూచనలు ఇస్తారా?" అని మంత్రి సరదాగా వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి సీఎం, స్పీకర్ హాజరవుతున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాక్ అసెంబ్లీకి ఎంపికవడంపై విద్యార్థిని ఆనందం వ్యక్తం చేస్తూ, ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం గతంలో కంటే మెరుగ్గా ఉందని తెలిపింది. దీనిపై స్పందించిన లోకేశ్, రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు మరింత నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థిని కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పుట్టుకతో దివ్యాంగుడైన ఆమె తండ్రి రాము, ట్రై-స్కూటర్‌పై కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారని తెలుసుకున్నారు. తమ ఇద్దరు కుమార్తెలకు 'తల్లికి వందనం' పథకం అందుతోందని, తనకు రూ. 6,000 పింఛన్ వస్తోందని రాము మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన లోకేశ్, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. "మంగళగిరి నా కుటుంబంలా మారిపోయింది. నాపై మరింత బాధ్యత పెరిగింది" అని అన్నారు. విద్యార్థిని శ్రీ కనకపుట్లమ్మ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మంత్రిని కలవడం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## శాంతిని కాంక్షిస్తాం.. కానీ, భద్రతపై రాజీపడం: ప్రధాని మోదీ

ప్రత్యేక నాణెం, స్మారక స్టాంపును ప్రధాని మోదీ విడుదల చేశారు. సత్యం, న్యాయం, విశ్వాసాల పరిరక్షణను తన ధర్మంగా భావించి దానికోసం గురు తేగ్ బహదూర్ జీవితాన్ని త్యాగం చేశారని చెప్పారు. "ఈరోజు ఉదయం రామాయణ నగరం (అయోధ్య)లో ఉన్నాను. ఇప్పుడు కృష్ణుడి నేల (కురుక్షేత్ర)పై ఉన్నాను. రామమందిరంపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన రోజు కర్తార్‌పుర్ కారిడార్ ప్రారంభోత్సవం కోసం పంజాబ్‌లోని డేరా బాబా నానక్‌కు వెళ్లాను. ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం కావాలని, రామభక్తులందరి ఆకాంక్షలు నెరవేరాలని ప్రార్థించాను. ఆ రోజు రామ మందిరానికి అనుకూలంగా తీర్పు వచ్చింది" అని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. నేడు మళ్లీ తనకు 'సిక్కు సంగత్' నుంచి ఆశీర్వాదాలు పొందే అవకాశం లభించిందన్నారు.

## ఇంకెంతకాలం.. ఏదో ఒక నిర్ణయం తీసుకోండి: అధిష్ఠానానికి సిద్ధూ సూచన

ఆ వార్తలకు శుభం కార్డు వేసేలా కాంగ్రెస్ అధిష్ఠానం ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. 2023లో జరిగిన కర్ణాటక విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. నవంబర్ 20తో ఆ రెండున్నరేళ్ల గడువు ముగిసింది. దాంతో కర్ణాటక రాజకీయాలు వేడెక్కాయి. ఐదేళ్లూ సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారని ఒకవైపు డీకే చెప్తున్నా.. మరోవైపు సీఎం పదవిపై ఆశను పరోక్షంగా వ్యక్తంచేస్తున్నారు. కర్ణాటక రాజకీయాల్లో మరికొన్ని రోజుల్లో కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నాయని ఇంకోవైపు విపక్ష నేతలు జోస్యం చెప్తున్నారు. "కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా తీవ్ర గందరగోళంలో ఉంది. మరికొన్ని నెలల్లో అనూహ్య పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీయవచ్చు" అని కేంద్ర మంత్రి కుమారస్వామి వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సిద్ధూ స్పందన వచ్చింది.

**అప్పుడు డీకేనే ఛాయిస్...**

సీఎం మార్పు చేపడితే రాష్ట్రంలో పార్టీ భవిష్యత్ ఎలా ఉంటుందనే దానిపై కాంగ్రెస్ సమాలోచనలు చేస్తోంది. ఒకవేళ సిద్ధరామయ్యను మారిస్తే.. ఆ స్థానంలోకి వచ్చేందుకు డీకే శివకుమార్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మూడో వ్యక్తికి ఆ పదవి దక్కే ఛాన్స్ చాలా తక్కువ అని పేర్కొన్నాయి. ప్రస్తుతం సిద్ధూ, డీకే పేర్ల చుట్టూనే చర్చ నడుస్తోందని తెలిపాయి. అయితే ఇప్పటివరకు తుది నిర్ణయం మాత్రం తీసుకోలేదని తెలుస్తోంది.

బెంగళూరులోని మల్లికార్జున ఖర్గే నివాసానికి ముఖ్యమంత్రి పదవికి ప్రధాన పోటీదారులంతా వరుసకట్టిన సంగతి తెలిసిందే. హెచ్.సి.మహదేవప్ప, కె.వెంకటేశ్, ఈశ్వర ఖండ్రే, లక్ష్మీ హెబ్బాళ్కర్ వారిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ వర్గాల స్పందన వచ్చింది.

## ఆపరేషన్ సిందూర్‌లో కృష్ణుడి సందేశాన్నే అనుసరించాం రాజ్‌నాథ్

రణక్షేత్రంలో ధర్మ పరిరక్షణ చేయాలని చెప్పే గీతాసారం మనకు స్ఫూర్తి అని వారు విస్మరించారు. ఆపరేషన్ సిందూర్ అనే ధర్మబద్ధ చర్య ద్వారా మన బలగాలు ఇచ్చిన సమాధానాన్ని ఉగ్రవాదులు ఈరోజుకీ మరిచిపోలేకపోతున్నారు. మనంతట మనం యుద్ధాలు కోరుకోకపోయినా మన జోలికి ఎవరైనా వస్తే తాటతీస్తామే గానీ పారిపోబోమని ప్రపంచానికి చాటాం. ఇది సైనిక చర్య మాత్రమే కాదు.. మన స్వావలంబనకు, ఆత్మగౌరవానికి ప్రతీక" అని మంత్రి వివరించారు. అర్జునుడికి కర్మయోగ గురించి శాశ్వత సందేశాన్ని కురుక్షేత్ర నుంచే కృష్ణుడు ఇచ్చారని, భౌగోళిక సరిహద్దులకు అతీతంగా ఇది అందరికీ వర్తిస్తుందని చెప్పారు. అర్జునుడికి మార్గనిర్దేశం చేయడానికే కాకుండా మానవాళి ఉమ్మడి చైతన్యాన్ని మేల్కొలపడానికి గీతాసారం దోహదపడుతుందని రాజ్‌నాథ్ వివరించారు. నైరాశ్యం నెలకొన్నప్పుడు ఇదొక కాంతిరేఖలా నిలుస్తుందన్నారు.

## దేశ నిర్మాణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు ఎనలేనివి














(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

దేశ నిర్మాణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు ఎనలేనివని మై భారత్ ప్రకాశం జిల్లా యువజన అధికారి మహేందర్‌రెడ్డి కొనియాడారు. మై భారత్ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఐక్యత ర్యాలీలో భాగంగా జిల్లాస్థాయి యూనిటీ మార్చ్ కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నుండి 3 కిలోమీటర్ల మేర విద్యార్థులతో జాతీయ జెండాలతో యూనిటీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్పందన హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పి సీఈవో చిరంజీవి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రాయపాటి అజయ్ తదితరులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైభారత్ జిల్లా యువజన అధికారి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అద్భుత పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తూ, యువతలో ఐక్యత, ధైర్యం, కర్తవ్య భావం పెంపొందించడమే ఈ యూనిటీ ర్యాలీ యొక్క ప్రధాన లక్ష్యం అని తెలియజేశారు.

జడ్పీ సీఈవో చిరంజీవి మాట్లాడుతూ భారతదేశంలో 562 సంస్థానాలను ఒక తాటిపైకి తెచ్చి దేశాన్ని ఏకీకృతం చేసిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని తెలిపారు. స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పటేల్ జీవితంలో నిజాయితీ అనేది ప్రథమ గుణమని తన బాధ్య త చిన్నదైనా పెద్దదైన కర్తవ్యంతో నిర్వహిస్తూ అంకితభావంతో పనిచేసే మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రాయపడి అజయ్ మాట్లాడుతూ ఈ ఐక్యత ర్యాలీ ద్వారా దేశ ప్రజలందరినీ ముఖ్యంగా యూత్ యువకులను దేశ పునర్మాణంలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా ఈ యూనిటీ మార్చ్‌ని నిర్వహించడం ఆయన సేవలు నేటి తరానికి తెలియజేయడం గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిటీ మార్చ్ కమిటీ సభ్యులు రాజేష్ వర్మ, ఈగల్ సెల్ కమిటీ మెంబర్స్ ఎస్ఎస్ఎన్ కళాశాల, ఎకేవీకే, పలు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మై భారత్ ఇవి నాగరాజు, వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.




## పోస్టు ఆఫీసు నుండి 10 లక్షల చెక్కు అందజేత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)
కేవలంలో రూ.557 ప్రమాద భీమా చేసుకున్న వజ్జా సుబ్బయ్య ప్రమాదవశాత్తు మరణించారు. దీంతో నామినీ అయిన వజ్జా రమేష్‌కు రూ.10 లక్షల చెక్కును విజయవాడ పీఎంజీ ఉపేంద్ర, ప్రకాశం డివిజన్ ఎస్‌ఎంపీ మురళి కుమార్ చేతుల మీద ప్రకాశం డీవోలో అందించడం జరిగింది.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
ప్రకాశం

# మార్కాపురం జిల్లా ఏర్పాటు


### నిర్ణయం ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

### 11.42 లక్షల జనాభాతో జిల్లా ఖరారు

### ఆరేళ్ళ ఎమ్మెల్యే కందుల పోరాటానికి తెరదింపిన సీఎం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 25)
రాష్ట్రంలో నూతన జిల్లాగా మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం అమరావతిలో జరిగిన మంత్రుల సబ్ కమిటీ సమావేశంలో నిర్ణయం ప్రకటించారు. దీంతో పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరినట్లయ్యింది. ఎన్నికల సమయంలో పలు మార్లు ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన జిల్లాల విభజన అశాస్త్రీయమని, తాము అధికారంలోకి వస్తే నూతన జిల్లాగా మార్కాపురంను ప్రకటిస్తామని హామీ ఇచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత, నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన హామీని నెరవేర్చుకున్నారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయాలని పట్టువదలని విక్రమార్కుడిలా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్ని పార్టీలను కలుపుకుని సుమారు 60 రోజుల పాటు పోరాటం




చేశారు. ఆ నాటి నుంచి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టువదలని విక్రమార్కుడిలా కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి మార్కాపురం జిల్లా చేసేందుకు విశేష కృషి చేశారు. మార్కాపురం జిల్లా ను చేస్తే తన జన్మధన్యమవుతుందని పలు మార్లు బాహాటంగానే ఆయన చెప్పారు. పశ్చిమ ప్రాంత ప్రజల కలను సాకారం చేసిన ఘనత ఎమ్మెల్యే కందులకు, కూటమి ప్రభుత్వానికి దక్కింది. మార్కాపురం జిల్లాలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలను కలుపుతూ జిల్లాను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. నూతన జిల్లా జనాభా 11.42 లక్షలు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ఏది ఏమైనా నూతన జిల్లా మార్కాపురం ఏర్పాటులో కృషి చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఇతర రాజకీయ పార్టీ నాయకుల కృషి ఎనలేనిదని నూతన జిల్లా ప్రజల భావన....




## సెలవు పై కనిగిరి కమిషనర్

## తాత్కాలికమా లేక లాంగ్ లీవా?

### నీటి రవాణా లో నిర్లక్ష్యమే కారణమా

### గత కమిషనర్ రంగారావు బాటలో కృష్ణమోహన్‌రెడ్డి?

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 25)
కనిగిరి మున్సిపల్ కమిషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి సెలవు పై వెళ్ళారు. దీర్ఘకాలిక సెలవు పై వెళ్ళేందుకు మూడు రోజుల పాటు సెలవు పెట్టారా అనే చర్చ కనిగిరిలో జోరుగా సాగుతోంది. ఈ నెల 22 నుంచి కనిగిరి పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటి రవాణా ఆగిపోయింది. కనిగిరి పట్టణంలో నీటి సమస్య పై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అతని పై ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కనిగిరిలో నీటి సమస్య ఇంకా వెంటాడుతుంది. కనిగిరి పట్టణంలో పేదలు ఎక్కువగా నివసించే బిసి కాలనీ, శివనగర్ కాలనీ, ఇందిరా కాలనీ, ఎన్‌జీఓ కాలనీల్లో నీటి రవాణా ఆగిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అంతే గాక ఎమ్మెల్యే ఉగ్ర బజారు, పరాశాల భారతి, కాశిరెడ్డి బజారు, కొత్తపేటల్లో కూడా నీటి సమస్య ఉంది. నీటి సమస్య పై ప్రజలు కమిషనర్‌కు మొరపెట్టుకున్నా స్పందించలేదనే ఆరోపణలున్నాయి. నీటి రవాణా టెండర్‌కు సంబంధించి అలివిగాని నిర్లక్ష్యాన్ని కమిషనర్ ప్రదర్శించాడనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రాష్ట్ర సచివాలయం నుండి డిప్యూటేషన్ పై వచ్చిన కృష్ణమోహన్‌రెడ్డి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి స్పీడుకు తగ్గట్టుగా పని చేయలేకపోయారనే విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రంగారావు అనే కమిషనర్ కనిగిరి మున్సిపల్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కూడా నీటి రవాణా విషయంలో ప్రజలకు వ్యతిరేకంగా పని చేశారనే విమర్శలుండడంతో ఆయన పై బదిలీ వేటు పడింది. నీటి రవాణాతో పాటు సాగర్ జలాల సరఫరాలో ఏ చిన్న తప్పిదం జరిగినా అధికారుల పై వేటు తప్పదని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మున్సిపల్ సమావేశంతో పాటు పట్టణంలో జరిగే పలు కార్యక్రమాల్లో అధికారులను హెచ్చరిస్తూనే ఉన్నారు. నాలుగు రోజులుగా నీటి రవాణా ఆగినా కమిషనర్ కు చీమ కుట్టినట్టుగా కూడా లేకపోవడంతో ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. నీటి రవాణాలో నిర్లక్ష్యం వహిస్తున్న ఏఈ ని కూడా తప్పించి మరో ఏఈకి బాధ్యతలు అప్పగించారు. కనిగిరి పట్టణంలో మంచినీటి సమస్యతో పాటు వాడుక (తరువాయి 4లో...)

## కరుణ కుమారికి రూ.5 లక్షల ప్రోత్సాహం

### కిషోర్ గ్రానైట్స్ అధినేత గొట్టిపాటి హర్ష అందజేత

### హర్షకు అభినందనలు తెలిపిన మంత్రి స్వామి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)
భారత జట్టు అంధుల మహిళా టీ20 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన విశాఖ బాలికల అంధుల రెసిడెన్షియల్ విద్యార్థిని పంగి కరుణ కుమారికి కిషోర్ గ్రానైట్స్ అధినేత గొట్టిపాటి హర్ష రూ.5 లక్షల ప్రోత్సాహం ప్రకటించినట్లు రాష్ట్ర దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో కరుణకుమారి చూపిన ప్రతిభకు ప్రోత్సాహంగా గొట్టిపాటి హర్ష రూ.5 లక్షల ప్రోత్సాహం ప్రకటించినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని, గొట్టిపాటి హర్షకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నానని మంత్రి స్వామి తెలిపారు.

# చంద్రబాబు ఎప్పుడూ రైతుల పక్షమే





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 25)
చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా, ముందుగా రైతుల సంక్షేమం గురించి ఎక్కువగా ఆలోచిస్తుంటారని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా గుడ్లూరు మండలం పూరేటిపల్లి గ్రామంలో మంగళవారం సభ నిర్వహించగా, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఇటీవల విడుదలైన అన్నదాత సుఖీభవ నిధులు, అందరి ఖాతాల్లో జమ అయ్యాయా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో రెండుసార్లు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేశామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబునాయుడు గారు నిలబెట్టుకుంటున్నారని గుర్తు చేశారు.

రైతు కుటుంబం నుంచి వచ్చిన ముఖ్యమంత్రి, ఎక్కువగా రైతులకు మేలు జరిగేలా పథకాలు తీసుకొస్తున్నారని చెప్పారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో వేలకోట్ల రుణాలను మాఫీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రస్తావించారు. గత వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తే, ఈ ప్రభుత్వంలో రైతుల కోసం ట్రాక్టర్లు, సబ్సిడీ రుణాలు, ఆధునిక యంత్రాలు, స్ప్రింక్లర్లు, డ్రోన్లు అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. అలాగే యూరియా కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల్లో నిధులన్నీ దారి మళ్లించడం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయిందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విమర్శించారు. సర్పంచులు అందరూ కేవలం పవర్ లేని పాలకులుగా మిగిలిపోయారని అన్నారు. ఈ ప్రభుత్వంలో సకాలంలో 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు ఇచ్చిందని తెలిపారు. పశుపోషణపై ఎక్కువగా ఆధారపడే పూరేటిపల్లి లాంటి గ్రామాలలో, అంటు వ్యాధులు ప్రజల కుండా పంచాయితీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎప్పటి కప్పుడు సైడ్ కాలవలు పూడికలు తీయించి, రెగ్యులర్‌గా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ఈ సందర్భంగా పూరేటిపల్లి గ్రామంలో (తరువాయి 4లో...)

**2014-19 ప్రభుత్వంలో పెద్ద ఎత్తున రుణమాఫీ**
**కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పథకం అమలు**
**ఇప్పుడు పంచాయతీలకు దండిగా నిధులు**
**కందుకూరు ప్రజలు ఆదరించి గెలిపించారు**
**వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నా**
**కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**
**గుడ్లూరు మండలం పూరేటిపల్లిలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

# చంద్రబాబు ఎప్పుడూ రైతుల పక్షమే





ఉన్న సమస్యలు, వాటి పరిష్కారాలపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. గ్రామం నుంచి పడమరడొంకకు వెళ్లే రోడ్డును త్వరలోనే తారు రోడ్డుగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఈసారి తాను గ్రామంలోకి అడుగుపెట్టక ముందే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా పైపులైన్ల మరమ్మతుల పనులు పూర్తిచేసి ఇంటింటికి కొళాయి నీటిని అందిస్తామని చెప్పారు. ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో కల్వర్టు కూడా నిర్మిస్తామన్నారు. ఇప్పటికే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గ్రామానికి వాటర్ ప్లాంట్ మంజూరు చేసి ఉన్నారని, అది కూడా త్వరలో అందుబాటులోకి రాబోతుందని ఎమ్మెల్యేగా తెలియజేశారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో ఆదరించి గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. అనంతరం గ్రామస్తులు నుంచి ఎమ్మెల్యే వినతి పత్రాలు స్వీకరించి వాటి పరిష్కారం పై అధికారులకు సూచనలు చేశారు. రైతుల ఇళ్లకు ఆయన స్వయంగా వెళ్లి, కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యత గురించి అంకెలతో సహా వివరించారు. ముందుగా గ్రామసభలో వెలుగు అధికారుల ద్వారా మహిళా స్వయం సహాయ సంఘాలకు మంజూరైన ఉన్నతి, స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజ్ పథకాల కింద ఆమోదించిన మొత్తం రూ.47 లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసులురెడ్డి, మండల ఈఓపిఆర్‌డి లక్ష్మీ లత, మండల వ్యవసాయాధికారి రవి కుమార్, మండల వెలుగు అధికారి చినబాబు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు అత్తంటి శ్రీనివాసులు, పార్టీ నాయకులు ఉమ్మనేని సుబ్బారావు, జడ యానాది, నరాల మాలకొండారెడ్డి, మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసన బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

### సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల నేతల పిలుపు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర సమితి, కేక్ యూనియన్ ల జేఏసీ ఇచ్చిన దేశవ్యాప్త నిరసనల పిలుపుమేరకు జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఈ నెల 26వ తేదీన చేపట్టే నిరసన బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు, కేంద్ర కార్మిక సంఘాల నేతలు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2021డిసెంబర్ 9వ తేదీన ఇచ్చిన హామీల ప్రకారం సీటు ప్లస్ 50 ప్రకారం పంటలకు మద్దతు ధర కల్పించి చట్టం చేయాలని డిమాండ్ చేశారు, పంటల సేకరణ, ప్రాసెసింగ్, విలువ జోడింపు, అమ్మకాలపై మిగులుతో రైతులకు వాటా వచ్చే విధంగా రూపొందించాలన్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్లు అన్నిటిని అన్ని పంటలకు కనీస మద్దతు ధరలకు కొనే కేంద్రాలుగా అభివృద్ధి పరచాలన్నారు. రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికుల రుణాలు సమగ్రంగా మాఫీ చేయాలన్నారు, రిజర్వ్ బ్యాంకులో ఉన్న మిగులు నిధులను నా బార్డ్ కు తరలించాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటను విరమించుకోవాలన్నారు. నెలకు 300 యూనిట్ల లోపు గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఒంగోలులోని కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దనుండి నిరసన బైక్ ర్యాలీ ప్రారంభమై ఆర్టీసీ బస్టాండ్, అద్దంకి బస్టాండ్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, పాత మార్కెట్ సెంటర్, కొత్తపట్నం బస్టాండ్ మీదుగా, చర్చి సెంటర్, కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ కొనసాగుతుందని, ప్రజలు విరివిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ లలిత కుమారి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కోడూరి నాంచార్లు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొండగుంట సుబ్బారావు, రెడ్ స్టార్ కార్మిక, కర్షక సంఘం నాయకులు భీమవరపు సుబ్బారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రమేష్, ఏఐఎఫ్టియు జిల్లా నాయకులు ఎం ఎస్ సాయి, ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఆర్ మోహన్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

## నాలుగు కేజీల గంజాయి, ఆరు హాశిష్ ఆయిల్ బాటిల్స్ పట్టివేత

### 12 మంది అరెస్ట్



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, నవంబర్ 25)**

మాచర్ల పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న సుమారు 12 మందిని మాచర్ల పట్టణ పోలీసులు సోమవారం రాత్రి 7 గంటల సమయంలో అరెస్టు చేసినట్లు గురజాల డిఎస్పీ జగదీష్ తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. మాచర్ల పట్టణంలోని పశువుల హాస్పిటల్ వెనుక భాగంలో 22వ వార్డులో ఉంటున్న చల్లా పెద్ద ఆంజనేయులు అను అతను పెద్ద మొత్తంలో గంజాయి అమ్ముతున్నట్లు రాబడిన సమాచారం మేరకు మాచర్ల పట్టణ ఎస్ఐ ఎం వెంకట్రావు ఎమ్మార్వో ఆధ్వర్యంలో ఇద్దరు వీఆర్వోలను మధ్యవర్తులుగా నియమించుకొని చల్లా పెద్ద ఆంజనేయులు అద్దెకుంటున్న ఇంట్లో సోదాలు నిర్వహించి, గంజాయి అమ్ముతున్న సుమారు 12 మందిని సోమవారం రాత్రి అరెస్టు చేశామన్నారు. పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న వారి పై ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి, పక్కా ప్రణాళిక ప్రకారం వారిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న వారి నుండి నాలుగు కేజీల గంజాయిని ఆరు హాశిష్ ఆయిల్ బాటిల్స్‌ను, గంజాయి అమ్ముతున్న వారి నుండి రూ.3,000లు స్వాధీన పరుచుకొని మొత్తం 12 మంది ముద్దాయిలను అరెస్టు చేసినట్లుగా ఆయన తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని అన్నారు. గంజాయి అమ్ముతున్న వాళ్లలో మిట్టమీద పల్లె, సిరిగిరిపాడు, మాచర్ల పట్టణంలోని 22వ వార్డుకు చెందిన వారిగా గుర్తించడం జరిగిందని తెలిపారు. డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఎక్కడైనా డ్రగ్స్ విక్రయిస్తున్న, తాగుతున్న సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ పోలీసు వారికి తెలియపరచి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గంజాయి ఎక్కడ విక్రయించినా, తాగుతున్న వారి పై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ముద్దాయిల పై కేసు నమోదు చేసి సబ్ జైలుకు తరలించడం జరుగుతుందన్నారు. పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకొని పెద్ద సంఖ్యలో గంజాయి బేరగాళ్లను అరెస్టు చేసిన మాచర్ల పట్టణ సిఐ టి వెంకటరమణ, ఎస్ఐ ఎం వెంకట్రావు, ఎస్ఐ బి అనంతకృష్ణ, పలువురు పోలీస్ స్టేషన్ సిబ్బందిని డిఎస్పీ జగదీష్ అభినందించారు.



## సెలవు పై కనిగిరి కమిషనర్ తాత్కాలికమా లేక లాంగ్ లీవా?

నీటి విషయంలో ఏ అధికారి నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించనని ఎమ్మెల్యే ఉగ్ర తరచూ హెచ్చరిస్తూనే ఉన్నారు. నాలుగు రోజులుగా నీటి రవాణా ఆగడం వలనే కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి సెలవు పై వెళ్ళాల్సి వచ్చిందని కనిగిరి పట్టణంలో ప్రచారం జరుగుతోంది.

**ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ప్రసాద్**

కనిగిరి మున్సిపాల్టీ కమిషనర్‌గా కార్యాలయ మేనేజర్ ప్రసాద్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. మేనేజర్ ప్రసాద్‌ను వెలుగు ప్రతినిధి సంప్రదించగా కమిషనర్ మూడు రోజుల పాటు సెలవు పై వెళ్ళారని, ఇన్‌ఛార్జి బాధ్యతలు తాను స్వీకరించానన్నారు. నీటి రవాణా పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు.

## రైతన్న మీకోసం ప్రజాహిత కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, నవంబర్ 25)**

మండలంలోని దూపాడు పంచాయతీలోని దీవెనపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన రైతన్న మీకోసం ప్రజాహిత కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సంగమేశ్వర్‌రెడ్డి పాల్గొని మంగళవారం గ్రామంలోని ప్రతి రైతు కుటుంబాన్ని వ్యక్తిగతంగా సందర్శించి, వారి సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా వివరించా రు. ప్రభుత్వం వచ్చే ఐదేళ్లలో రైతు సంక్షేమం కోసం అమలు చేయబోతున్న ఐదు కీలక కార్యక్రమాలు ఇవి సాగునీటిని భద్రంగా, సమర్థవంతంగా ప్రతి ఎకరానికి నీరు అందించేందుకు, మార్కెట్ అవసరాలను విశ్లేషించి, రైతులకు లాభదాయకమైన పంటలను సూచించే వ్యవస్థ. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత ప్రవేశపెట్టి, అధిక దిగుబడులు సాధించేందుకు మార్గదర్శకత్వం. పంటలకు విలువ జోడించి, రైతుల ఆదాయాన్ని అనేక రెట్లు పెంచే అవకాశాల విస్తరణ.రైతులు ఉపయోగించుకోగల పథకాలు, సబ్సిడీలు, ఆర్థిక సహాయాల పై పూర్తి సమాచారం. ఈ మహా కార్యక్రమం యొక్క ఏకైక లక్ష్యం రైతన్నను రాజును చేయడం. మన ఆహార భద్రతకు శ్రమించే ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందాలని, గౌరవం పొందాలని, ఆర్థికంగా బలపడాలని ప్రభుత్వం సంకల్పం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉదయలక్ష్మి, వెటర్నరీ డాక్టర్, గ్రామ వ్యవసాయ సహాయకులు అచ్యుతరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన రైతన్నా... మీ కోసం కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, నవంబర్ 25)**

కొత్త ఆలోచనలు పంచుకుంటూ మార్పుకు నాంది పలుకుతూ ప్రభుత్వానికి అన్నదాతలు అందరూ తోడ్పాటును ఇవ్వాలని కోరుకుంటూ సచివాలయ సిబ్బంది ద్వారా వారం రోజుల పాటు అన్ని గ్రామాలలో రైతన్నా... మీకోసం కార్యక్రమం ప్రారంభించడం జరిగినది అని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఒక జట్టుగా ఏర్పడి గ్రామంలోని అందరూ రైతులను వారి ఇంటి వద్ద కలిసి, వారి కోసం ప్రభుత్వం చేసిన పనులను కూలంకషంగా వివరించి రైతుల యొక్క సమస్యలు, సలహాలు, కొత్త ఆలోచనలు స్వీకరించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. రానున్న ఐదు సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు ముఖ్యమంత్రి తెలియజేసిన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే ఐదు విధానాలతో ప్రభుత్వం కార్యచరణ అమలు చేస్తున్నట్లు రైతులకు, సచివాలయ సిబ్బంది తెలియజేశారన్నారు.

# శానిటేషన్ పై మార్పు తీసుకురావడమే ఈడబ్ల్యూడబ్ల్యూ ప్రోగ్రాం లక్ష్యం

## ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు మంగళవారం స్వచ్ఛ మిత్రలు, సానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్స్పెక్టర్లతో కమీషనర్ చాంబర్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో కమీషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పైలట్ ప్రాజెక్ట్ కింద ఐటీసీ వారి సహకారంతో డబ్ల్యూఓడబ్ల్యూ కార్యక్రమం చెప్పటం జరిగిందని తెలిపారు. ప్రజలలో సానిటేషన్ గురించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావడమే ఈ డబ్ల్యూడబ్ల్యూ ప్రోగ్రామ్ లక్ష్యం అని తెలిపారు. దీనిద్వారా మన ఒంగోలు ను క్లీన్ ఒంగోలు చేయవచ్చన్నారు. దీని కోసం ఐటీసీ వారు సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా మన ఒంగోలు నగరంలో 30 మంది స్వచ్ఛ మిత్రలను ఏర్పాటు చేసుకోవడం జరిగినది అని తెలిపారు. క్లీన్ ఒంగోలు కార్యక్రమంలో భాగంగా, జనవరి 2026 నుంచి వారంలో రెండు రోజులు బుధవారం, ఆదివారం రెండు రోజులలో మాత్రమే పొడి చెత్తను సేకరించటం జరుగుతోంది. మిగిలిన 5 రోజులలో ఒక్క తడి చెత్తను మాత్రమే ప్రతి ఇంటి నుంచి సేకరించటం జరుగుతోంది అని కమీషనర్ తెలిపారు. ఈ మార్పులను ఒక నెల ముందుగానే ప్రజలకు తెలియచేయటం జరుగుతుందన్నారు. ప్రజలందరూ కూడా ఈ మార్పులకు సహకరించి మన ఒంగోలు నగరం ని క్లీన్ నగరంగా తయారుచేయటంకు తమ సహకారం ని నగరపాలక సంస్థ కు అందించగలరని కమీషనర్ కోరారు. ఈ క్లీన్ ఒంగోలు లో భాగం గా ప్రతి ఒక్కరూ కూడా వారి ఇండ్ల నుంచే తడి పొడి చెత్తను వేరు చేసి ఇంటిదగ్గరకు వచ్చే శానిటేషన్ వర్కర్స్ ఇవ్వడం, సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకుండా క్లాత్ బ్యాగ్స్ వాడటం, వారి ఇండ్ల నుంచి వచ్చే చెత్తను రోడ్ , కాలువలలో వెయ్యకుండా ఉండాలని నగరప్రజలని కోరారు. అలానే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతి నెల సానిటేషన్ గురించి ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా ఫీడబాక్ తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నెల ఐవీఆర్ఎస్ రిపోర్ట్ ప్రకారం మన ఒంగోలు నగరపాలక సంస్థ పనితీరు ఆశించినంత మేరకు లేదు అని దీనికి గల కారణాలను కనిపెట్టి వాటిని అధిగమించటం ద్వారా వచ్చే నెల లో మన నగరపాలక సంస్థ సానిటేషన్ విభాగా పనితీరు మెరుగుపరుచుకునే విధముగా చర్యలు తీసుకోవాలి ఎంహెచ్వోకి ఆదేశాలు ఇవ్వటం జరిగింది. దీనిలో భాగంగా,అందరూ స్వచ్ఛ మిత్రలు కూడా వారి సచివాలయ పరిధిలలోని ప్రజలతో కలిసి వారి దగ్గర నుంచి కార్పొరేషన్ వర్కర్స్ చెత్తను సేకరించారా లేదా, కాలువలను శుభ్రపరుస్తున్నారా లేదా , చెత్తకుప్పలను తొలగిస్తున్నారా లేదా అనే ప్రశ్నలుకు ప్రజల నుంచి సమాధానం తీసుకొని రిపోర్ట్ సబ్మిట్ చేయవలసిందిగా స్వచ్ఛ మిత్రలను కోరారు. దీనివల్ల ఏ సచివాలయ ప్రాంతాలలో సానిటేషన్ వర్క్స్ సరిగా జరగటం లేదో తెలుసుకుని వాటిని తప్పనిసరిగా రోజువారీ జరిగేలా చర్యలు తీసుకోవాలని అని ఎంహెచ్వోకి ఆదేశించారు. అలానే సచివాలయ శానిటరీ సెక్రటరీకి తమ సచివాలయ పరిధిలో గల ప్రజలతో మర్యాదగా మాట్లాడటం ద్వారా సానిటేషన్ గురించి వచ్చిన నెగెటివిటీ ఫీడ్



# రాజ్యాంగ దినోత్సవ సభను జయప్రదం చేయండి

## జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు పిలుపు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

ఈ నెల 26వ తేదీన బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులోని ఆచార్య రంగా భవన్లో మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాలకు నిర్వహించే రాజ్యాంగ దినోత్సవ సభను జయప్రదం చేయాలని రైతుబంధు పురస్కార గ్రహీత, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చుండూరి రంగారావు మాట్లాడుతూ రాజ్యాంగం గురించి ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగం గురించి తెలుసుకోవటం ద్వారా దేశ పౌరులుగా రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుల గురించి, ఎలా నడుచుకోవాలో తెలుస్తుందన్నారు. సమిష్టిగా ఒక జాతి సర్వతో ముఖాభివృద్ధికి, గౌరవప్రద జీవనానికి ఇది ఎంతో ఉపకరిస్తుందన్నారు. స్థానిక ఆచార్య రంగా భవన్లో నిర్వహించే సభకు సీనియర్ న్యాయవాది, ప్రగతిశీల మేధావుల వేదిక నేత పంగులూరు గోవిందయ్య అధ్యక్షత వహిస్తుండుగా ముఖ్యఅతిథిగా రాజకీయ, ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ పరకాల ప్రభాకర్ హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా రిటైర్డ్ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి సలదల బసవయ్య, రిటైర్డ్ జిల్లా జడ్జి వి నాగేశ్వరరావు, ప్రసిద్ధ నాటక ప్రయోక్త పాటిబండ్ల ఆనందరావు లతోపాటుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, అఖిలభారత రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, ఓపిడియా రాష్ట్ర అధ్యక్షులు శ్రావణి సుధాకర్ రావు, ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలవరపు వెంకటరామయ్య, అభ్యుదయ కవి పిన్నిక శ్రీనివాసరావు లు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుల గురించి ప్రసంగిస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, కేఎన్పిఎస్ జిల్లా నాయకులు ఎం జార్జ్, డి అంకయ్య, ఐఎన్పి నాయకులు దాసరి సుందరం, యెట్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ ప్రతులను దగ్ధం చేసిన మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ నాయకులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

కేంద్ర ప్రభుత్వం నూతనంగా నోటిఫై చేసిన నాలుగు లేబర్ కోడ్లని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ ఖండిస్తుంది. కేంద్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా ప్రవేశపెట్టిన ఈ నాలుగు లేబర్ కోడ్స్ కార్మికుల యొక్క హక్కులను పూర్తిగా హరించి వేసే విధంగా ఉంది. ఇప్పటి వరకు మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్ తన హక్కులు కాపాడు కోవడానికి ఆధారంగా ఉన్న సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976 పూర్తిగా రద్దు అవుతుంది. కేంద్ర కేంద్ర ప్రభుత్వ చర్యను నిరసిస్తూ మూడు రోజులపాటు పని ప్రదేశంలో నల్ల బ్యాడ్జిని ధరించి, మంగళవారం ఉదయం కలెక్టర్ ఆఫీస్ వద్ద లేబర్ కోడ్స్ ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. అలాగే రేపు సిఐటియు మరియు కేంద్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే నిరసనలో మెదికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ వందలాదిగా పాల్గొనాలని పిలుపునిస్తున్నాం. ఈ కార్యక్రమంలో మెడికల్ సేల్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జే ఉదయ్ కిరణ్, కార్యదర్శి కృష్ణ మోహన్, సంయుక్త కార్యదర్శి గోపి రామ్, మిగతా యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.





# ఘనంగా జాతీయ వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 25)

పట్టణంలోని వాసవి విద్యానికేతన్ నందు, జాతీయ వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యులు కె. రంగయ్య, ఏవో రంజిత్, వ్యాయామ ఉపాధ్యయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రంగయ్య మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం చాలా ముఖ్యమైనందన్నారు. ఎందుకంటే అందరు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి, మనసు ప్రశాంతంగా ఉంటే అన్ని పనులు సమకూరుతాయని, ఈ రోజు "హ్యారి క్రా బక్" అనే మహనీయుడు, ఆయనే మనం "ఫాదర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 1900 లో మద్రాస్ లో వైఎంసీఏ కాలేజ్ స్థాపించాడు. అలాగే వాసవి పీఈటీఎన్ కూడా ప్రసంగిస్తూ అందరూ ఆర్యోంగా ఉండాలంటే వ్యాయామం చేయాలన్నారు. అందరు క్రమశిక్షణతో ఉంచాలి. పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి అన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా పాఠశాల "పీఈటీలు" ఇలాజర్, ప్రభాకర్ ఆధ్వర్యంలో అటపోటిలు నిర్వహించి, గెలిచిన వాళ్ళకు ప్రధానపాద్యాలు చేతిమీదుగా చిన్నారులకు " స్వర్ణ పతాకాలను" అందచేపారు. రంగయ్య పీఈటీ ఘనంగా సన్మానించి సత్కారం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు ప్రతి ఒక్కరికి కళాశాల చైర్మన్ రంగయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళల పై జరుగుతున్న దాడుల పై చర్చ జరగాలి

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

మహిళల పై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నేషనల్ డే ఫర్ ది ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ అనే కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుందని రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారి సూచనల మేరకు స్వధార్ హెూమ్లో నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం అన్నారు. మంగళవారం 25వ తేదీన ఒంగోలు పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల మహిళ అభ్యుదయ సమితి వారి సహకారంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళల మీద జరుగుతున్న లైంగిక దాడి గురించి సమాజంలో విస్తృతంగా చర్చ జరగాలని, తద్వారా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి హింసను అరికట్టాలని ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని న్యాయమూర్తి అన్నారు. మహిళల పై జరుగుతున్న హింస అనేది రూపం మార్చుకుని మానసికంగానే మరి వివిధ రకాలుగా మహిళలను హింస గురి చేస్తున్నారని, వీటిని ప్రాథమిక దశలోనే గుర్తించి నిర్మూలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వధార్ హెూమ్ నిర్వాహకులు తేళ్ల అరుణ, శక్తి మిషన్ డీఎంసీ అవాంజెలిన్, వడ్డెర కార్పొరేషన్ సభ్యులు టి రమాదేవి, సఖి వన్ స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ ఎన్ జ్యోతి, సుప్రియ, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలి

## టీడీపీ కేడర్‌కు దామచర్ల దిశా నిర్దేశం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

ఒంగోలు నగరంలో ఎటు చూసినా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ప్రజలు ఇబ్బంది పడకూడదని పనులు చేయిస్తున్నాను. మీరంతా ప్రజల్లో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలి. అదే సమయంలో వారికి ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని 'తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జిలు, డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఒంగోలు నగరంలో రౌడీయిజం వేయడం, కబ్జాలు చేయడం, గంజాయితో వీరంగం సృష్టించడం వంటివి జరిగాయన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరంలో ప్రశాంత వాతావరణ నెలకొందని, అదే





సమయంలో ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ఒంగోలు నగరంలో 8,000 మంది సిపాయిలుగా టీం ఏర్పాటు చేశానని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. కొన్ని డివిజన్లలో నాయకుల మధ్య సమన్వయం లోపించిందని, దానిని సరి చేసుకుంటూ ఎక్కడ ఇబ్బంది కలక్కుండా చూసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో బూత్ ఇన్చార్జి దగ్గర నుండి క్లస్టర్ ఇంచార్జి వరకు బాధ్యతగా పనిచేసే మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని దామచర్ల జనార్దన్ రావు ఉద్బోధించారు. ఈ సమావేశంలో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, టిడిపి నగర అధ్యక్షుడు బండారు మదన్, సీనియర్ నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, పల్లపోతు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలి

### జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో పురోగతిపై ఆయన సమీక్షించారు. ఇందులో సచివాలయ ఉద్యోగులు కూడా ఉన్నందున ఇతర కార్యక్రమాల పేరుతో ఎస్.ఐ.ఆర్. నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని హెచ్చరించారు. ఎస్ఐఆర్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. 2002 నాటి జాబితాతో సరిపోల్చుతూ మ్యాపింగ్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ దిశగా పర్యవేక్షించాలని జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావులకు ఆయన చెప్పారు.

## సైనిక స్కూల్ ఏర్పాటు పై కమిటీ నివేదిక ఇవ్వాలి







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ మంగళవారం ఒంగోలు శివారులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలును సందర్శించారు. ఈ ప్రాంగణంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు సౌకర్యాలు ఉన్నవో లేవో పరిశీలించి ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఈ స్కూలును సందర్శించారు. ఆయన వెంట కలికిరి సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సిఎస్ పరదేశి, నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ శివరాం, డీఈవో కిరణ్ కుమార్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, ఇతర అధికారులు ఉన్నారు.

## 2026 సాధారణ సెలవుల్లో కార్తీక పౌర్ణమి పండుగను చేర్చాలి

### ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరిన ఆపస్ నేతలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

2026 సంవత్సర సాధారణ సెలువుల్లో కార్తీక పౌర్ణమి పండుగను చేర్చాలని ఆపస్ నేతలు కోరారు. మంగళవారం విజయవాడలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యదర్శి (జిఏడి పొలిటికల్), ఎండోమెంట్ కమిషనర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐచ్ఛిక సెలవులలో పది ముఖ్య పండుగలైన తొలి ఏకాదశి, రాఖీ పౌర్ణమి, గురుపౌర్ణమి, శ్రీపంచమి, ముక్కోటి ఏకాదశి, నరక చతుర్థి, బుద్ధపౌర్ణమి, హనుమత్ జయంతి లాంటి ముఖ్యమైన పండుగలను చేర్చాలని వినతి పత్రాలు అందజేశారు. ఐచ్ఛిక సెలవులలో ఐదు ఐచ్ఛిక సెలవులను అదనంగా చేర్చడానికి సూత్రప్రాయంగా అధికారులు అంగీకరించినట్లు వారు తెలిపారు. అధికారులను కలిసిన వారిలో ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాలాజీ, ప్రధాన కార్యదర్శి జివి సత్యనారాయణ, రాష్ట్ర సంఘటన కార్యదర్శి సిహెచ్ శ్రావణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిప్రసాద్, తదితరులు ఉన్నారు.



## ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్







(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 25)

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో పార్టీ మెజార్జీ తక్కువ వచ్చిన బూత్‌లకు పార్టీ ముఖ్య నాయకులను, జిల్లా, రాష్ట్ర నాయ నాయకులను బూత్ పరిశీలకులుగా రాష్ట్ర పార్టీ నియమించింది. అందులో భాగంగా రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్‌ని కనిగిరి నియోజకవర్గం, వెలిగండ్ల మండలంలోని బూత్ నెం.31, 34, 38, 43 నాలుగు బూత్‌లను కేటాయించి బూత్ పరిశీలకులుగా నియమించారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని మర్యాద పూర్వకంగా వారు కలిసారు. ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ వెలిగండ్ల మండల తెలుగుదేశంపార్టీ మండల ప్రెసిడెంట్ కే ఇంద్ర భూపాల్‌రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు కేసరి రమణారెడ్డి, కనిగిరి పట్టణ మాజీ సర్పంచ్ విశ్వనాధుని చిరంజీవి , తెలుగుదేశం పార్టీ కనిగిరి పట్టణ ఉపాధ్యక్షులు కొలిపర్తి మారుతి, తెలుగుదేశంపార్టీ నాయకులు చెన్న సుబ్రహ్మణ్యం, కొలిపర్తి రత్నం, పొదిలి పట్టణ మాజీ ఉప సర్పంచ్ జిలాని భాష, యూనిట్ కన్వీనర్ కారంశెట్టి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# 'డప్పు'కు జాతీయ గుర్తింపు కావాలి

**ఏపీడీకేఏస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్**

**ఒంగోలు లో ప్రారంభమైన ఏపీడీకేఏస్ ప్రకాశం జిల్లా మహాసభలు**

**డప్పుల మోతతో దద్దరిల్లిన ఒంగోలు నగరం**

**డప్పు కళాకారులకు గుర్తింపు కార్డుల మంజూరులో, పెన్షన్ నమోదులో సహకరిస్తామని తెలియజేసిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె అర్జున్ నాయక్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)**

డప్పు కళాకారుల సంఘం ప్రకాశం జిల్లా 2వ మహాసభలు ఒంగోలు నగరంలో సంఘం జిల్లా అధ్యక్షులు సూరి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె అర్జున్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరిస్తావని గుర్తింపు కార్డులు త్వరితగతిన మంజూరయ్యేల చర్యలు చేపడతామని, రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇస్తామని హామీ ఇచ్చినారు. మేడా శ్రీనివాసరావు ఒంగోలు 2వ పట్టణ సీఐ మాట్లాడుతూ సమాజంలో అంతరించిపోతున్న కలలను బ్రతికించడంలో డికెఎస్ చేస్తున్న కృషిని కొనియాడారు. నేటికీ అంటరానితనం వంటి వాటిపై సాధ్యమైన మేరకు మాలాంటి వారం రూపుమాపటం కోసం కృషి చేస్తున్నామని చట్టానికి లోబడి ఏ విషయాన్నైనా పరిగణలోకి తీసుకొని పనిచేస్తున్నామని సమాజంలో అంతరాలు తొలగించడం కోసం కృషి చేస్తున్నటువంటి కెవిపిఎస్ దాని అనుబంధ సంఘమైన డప్పు కళాకారుల సంఘాన్ని కొని ఆడారు. ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్‌లి మాట్లాడుతూ పాటకు, ఆటకు గుర్తింపునిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డప్పుకు ఎందుకు గుర్తింపునివ్వడం లేదని మండిపడ్డారు. డప్పులు వాయించేది దళితులు కాబట్టే అంటరానివారిగా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేర్చుకున్న కళలకు రూ.7 వేలు పెన్షన్ ఇస్తుండగా, ప్రాచీన కళ డప్పును నమ్ముకున్న కళాకారులకు రూ. 4 వేలే ఇస్తారా..? ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. డప్పు కళాకారుల వయోపరిమితిని 45కు తగ్గించి పెన్షన్ రూ.7 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నార కాలం గడిచిపోయినా ఇప్పటివరకు డప్పు కళాకారుల పెన్షన్ జాబితాను ఆన్లైన్ లో ఉంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డప్పు కళాకారులకు ధార్మిక క్షేత్రాల్లో ప్రదర్శనలకు, ట్రస్ట్ బోర్డుల్లో పదవులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డులివ్వడంతో పాటు బస్సు, రైలు ప్రయాణల్లో రాయితీ ఇవ్వాలని సూచించారు. ఉండడానికి ఇల్లు, వ్యవసాయానికి రెండెకరాల భూమిని మంజూరు చేయాలన్నారు. డప్పు కళ అంతరించపోకుండా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రూ.10 లక్షల ప్రమాద బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ సమాజంలో నేటికీ చిన్న చూపుగా చూపబడుతున్నట్టు డబ్బు కళాకారుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి పై రాబోయే రోజుల్లో మరింత ఆందోళన పోరాటాలు నిర్వహించాలని దానికి వ్యవసాయ కార్మిక సంఘం అన్నదండలు కల్పిస్తుందని నేడు దేశంలో రాష్ట్రంలో ప్రమాదకరమైన పరిస్థితులు ప్రజానీకం మీద పడతా ఉన్నాయని ప్రత్యేకించి దళితులు బలహీన వర్గాల మీద ఈ దాడి మరింత ఎక్కువగా ఉందని రాబోయే రోజుల్లో డప్పు శబ్దంతో ఆ యొక్క అంశాలను ప్రజలకు చాటి చెప్పే విధంగా మీరు నేర్పరితనంగా ఉండాలని వారు తెలియజేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురామ్ మాట్లాడుతూ డప్పు కళాకారులు సమరశీల ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలరని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో కేవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జవాజి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, టి రామారావు, నాయకులు కత్తి యోబు వివిధ మండలాల నుండి హాజరైన డప్పు కళాకారులు పాల్గొన్నారు.




# అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం

**(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 25)**



మండలంలోని వగ్గంపల్లి మెయిన్ అంగన్వాడీ కేంద్రం నందు "అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం"లో భాగంగా గృహహింస నిరోధక చట్టం -2005 కార్యక్రమమును నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవీఎస్. పార్వతి స్త్రీలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో స్త్రీలు గృహహింసలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, భ్రూణ హత్యలు , లింగ వివక్షత అధికమవుతున్నాయని, ఆత్మ న్యూనతా భావానికి లోనై స్త్రీలు ఆత్మహత్య చేసుకుంటున్నారని, సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా స్త్రీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వీటిని అరికట్టేందుకు 1999 డిసెంబర్ 17వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం నవంబర్ 25న స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింస వ్యతిరేక దినం పాటించాలని తీర్మానించారు. భారతదేశంలో గృహింస ను నేరంగా గుర్తించి గృహహింస నిరోధక చట్టం 2005ను ప్రభుత్వం తీసుకొని వచ్చారని అన్నారు .స్త్రీల పై లైంగిక దాడులు, శరీరాన్ని తాకిన, దాడి చేసిన ,అవమాన పరచిన, ఫోటోలు, వీడియో తీసిన, అదనపు కట్నం కోసం వేధింపులు, భార్య ఉండగా మరో పెళ్లి చేసుకున్న, గృహిణులను శారీరకంగా, మానసికంగా, హింసించిన, ప్రేరేపించిన ,ప్రోత్సహించిన విధించే భారత శిక్షాస్మృతి శిక్షలను లోని సెక్షన్లు గూర్చి తెలియజేసిరి. ఈ చట్టాలను మీరు తెలుసుకొని రక్షణ పొందాలని, బాలికలను విద్యావంతులు చేసినప్పుడే చట్టాలను తెలుసుకొని రక్షణ పొందగలుగుతారన్నారు. అనంతరం గ్రామంలో గృహ హింస నిరోధకర్యాలీ నిర్వహించిరి. కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్త ఎల్ దేవిశ్రీ, సహాయకురాలు ఏ నారాయణమ్మ, గ్రామంలో మహిళలు పాల్గొన్నారు.




# నవంబర్ 26న జరిగే రాజ్యాంగ ఆమోద వజ్రోత్సవ వేడుకకు తరలిరండి

**హెచ్‌సిఎం అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టరేట్ కాంస్య విగ్రహం వరకు ర్యాలీ**

**దళిత హక్కుల నేత నీలం నాగేంద్రరావు వెల్లడి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)**



నవంబర్ 26 బుధవారం ఉదయం 10 గంటలకు హెచ్‌సిఎం కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే భారత రాజ్యాంగ ఆమోద వజ్రోత్సవ వేడుకలో దళిత బహుజనులు పాల్గొనాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు కోరారు. మంగళవారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ కలెక్టర్ పి.రాజాబాబు సహా జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా అధికారికంగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ రాజాబాబు హెచ్ సి యం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తొలుత పుష్పమాలంకరణ చేయటం ద్వారా ప్రారంభిస్తారన్నారు. హెచ్‌సిఎం అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టరేట్ దగ్గరున్న అంబేద్కర్ కాంస్య విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. 2014 వరకూ అంబేద్కరిస్టులు నవంబర్ 26న రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని జరిపే వారని, ప్రభుత్వం రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని మాత్రమే నిర్వహిస్తూ వచ్చిందన్నారు. దళితుల డిమాండ్ మేరకు 2015 నవంబర్ 26 నుండి మోడీ ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తుందన్నారు.



# ఆచూకీ తెలపగలరు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)**

గుంటూరు మాస్టర్ మైండ్ కాలేజ్ సిప ఫౌండేషన్ చదువుతున్నాడు. ఇతను 20.11.25 మధ్యాహ్నం నుంచి గుంటూరు నుండి డోన్ వెళ్ళు ట్రైన్ ఎక్కి బయలుదేరి వచ్చాడు. కానీ ఎక్కడ దిగాడో ఏమిటి అనే విషయం తెలవట్లేదు. ఇతని ఆచూకీ తెలిసినవారు 9885700703కి కాల్ చేయాలని కోరారు.

# రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై ఆకర్షితులై టిడిపిలో చేరికలు




(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 25)

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో లింగసముద్రం మండలం పెంట్రాల పంచాయతీ రాళ్లపాడు గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు బుధవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకీ రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ కండువాలు ధరించారు. ముందుగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వయంగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి వర్గానికి న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధ్యమయ్యేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనేనని, గత ప్రభుత్వంలో ప్రజలు అనుభవించిన అస్తవ్యస్త, విధ్వంస పరిపాలనకు పూర్తి విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు నమ్మకం, న్యాయం, సంక్షేమం అందిస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ ప్రజల జీవితాల్లో నూతన ఆశలు నింపుతున్నారని, యువనేత , రాష్ట్ర మంత్రి నారా లోకేష్ భారీ పరిశ్రమల స్థాపన ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. టిడిపిలో చేరిన కుటుంబాల సభ్యులు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రామీణాభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ తమను ఆకట్టుకుందని తెలిపారు. పార్టీ బలోపేతానికి తాము కట్టుబడి పనిచేస్తామని వారు భరోసా ఇచ్చారు.

## ఎమ్మెల్యే ఇంటూరి 15 కుటుంబాలు టిడిపిలో చేరిక



**టిడిపిలో చేరిన కుటుంబాల వివరములు :**

మన్నేపల్లి రమేష్, మన్నేపల్లి సురేష్, మేలింగి తిరుపాలు, తాళ్లూరి మాలకొండయ్య, మన్నేపల్లి నాగేశ్వరరావు, మన్నేపల్లి ప్రసంగి, ఇంద్రకంటి రమేష్, నూకతోటి అలరాజు, జవంగుల ఆంజనేయులు, మన్నేపల్లి ధనుష్, మన్నేపల్లి లక్ష్మీనరసయ్య తదితరులు. ఈ కార్యక్రమంలో లింగసముద్రం మండల తెలుగు రైతు అధ్యక్షులు మద్దెల రామారావు, సహా పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 25)

కనిగిరి పట్టణానికి చెందిన గొంట్ల కొండయ్య (గోల్డ్ మర్చంట్) కుమారుని వివాహం ఇటీవల జరిగింది. మంగళవారం మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపి పరిశీలకులు కదిరి బాబురావు వారి నివాస గృహానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్బీ బుజ్జి, మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, మాజీ ఎంపిటిసి డిష్ జిలాని, శివాలయం కమిటీ మాజీ అధ్యక్షులు గొంట్ల మల్లిఖార్జున, షేక్ ఖాసిం సాహెబ్, బొట్టు శ్రీను, షేక్ రషీద్, రహిమాన్, నాగూర్ వలి, బంగారం మెరుగు షరీఫ్, చిల్లా సాయి, ఖాదర్ ఖాన్, ముత్యాల ప్రతాప్, మర్తాల రాము, నిమ్మల శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## జల్లెడ పట్టిన పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్ఐ వి వేమన





(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 25)

పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలో పెద్ద బస్టాండ్ సెంటర్ వద్ద ఎస్ఐ వి వేమన వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేసి వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేని వాహనాల పై కేసులు నమోదు చేసారు. పెద్ద బస్టాండ్ సెంటర్లో ఏ వాహనాన్ని వదలకుండా ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేసారు. పొదిలి పోలీస్ యంత్రాంగం సరైన పత్రాలు లేని వాహనాలు నడిపిన, మైనర్ బాలురు వాహనాలు నడిపినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు. నియమ, నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే ఎంతటి వారైనా సరే శిక్ష తప్పదని ఎస్ఐ స్పష్టం చేశారు.

## చర్మ, డప్పు కళాకారుల పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, నవంబర్ 25)

మాదిగ చర్మకారుల డప్పు కళాకారుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మండలంలోని సుంకేసుల గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఇండియా వైస్ ప్రెసిడెంట్,ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు నల్లూరి నాగయ్య పాల్గొని మాట్లాడుతూ డప్పు కళాకారులకు చర్మకారులకు పింఛన్లు మంజూరులో లేవని పాత పెన్షన్ ఉన్నాయని, నూతన పింఛన్ల కోసం ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసి చర్మకారులకు, డప్పు కళాకారులకు డిసెంబర్ నెలలో పింఛన్లు విడుదల చేయాలని, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని కోరుతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తినే దైవంగా భావించి చర్మకారులకు డప్పు కళాకారులకు హార్దిక సహాయం రూ.2 లక్షల ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# మాచర్ల లోకల్ ఆటో జనరల్ బాడీ సమావేశం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, నవంబర్ 25)

మాచర్ల పట్టణంలోని లోకల్ ఆటో జనరల్ బాడీ సమావేశం మాచర్ల మిర్చి యార్డ్ నందు మంగళవారం సిఐటియు రాష్ట్ర కార్యదర్శి అబ్రహం లింకన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అబ్రహం లింకన్ మాట్లాడుతూ లోకల్ ఆటో డ్రైవర్స్ సమస్యలు తీరాలంటే అందరూ కలిసి ఐక్యంగా ఉండి యూనియన్ ఏర్పాటు చేసుకొని కమిటీని ఎన్నుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ అధ్యక్షునిగా షేక్ నజీర్ భాష, ఉపాధ్యక్షులుగా ఆదిరాల డేవిడ్, ప్రధాన కార్యదర్శిగా రెంటాల పుల్లారావు, సహాయ కార్యదర్శిగా దండగిరి రాంబాబు, కోశాధికారి వాడపల్లి నాగభూషణం, కార్యవర్గ సభ్యులు ఉప్పుతోళ్ల గౌరీ శంకర్, మరో కార్యవర్గ సభ్యులుగా ఆలేటి సజ్జనియేలు, గౌరవ అధ్యక్షులుగా పోలేపల్లి అబ్రహం లింకన్‌లను లోకల్ ఆటో డ్రైవర్స్ అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాచర్ల లోకల్ ఆటో డ్రైవర్ ఓనర్స్ అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# దేశాన్ని ఒక్కతాటి పైకి తెచ్చిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 25)

దేశాన్ని ఒక్కతాటిపైకి తెచ్చిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ప్రకాశం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి అన్నారు. ప్రకాశం జిల్లా మేరా యువ భారత్ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులో యూనిటీ మార్చ్ నిర్వహించారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి, మేరా భారత్ ప్రకాశం జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి లు జెండా ఊపి యూనిటీ మార్చ్ ను ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభమైన మార్చ్ నెల్లూరు బస్టాండ్, రత్నమహల్ సెంటర్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ చిరంజీవి విలేకరులతో మాట్లాడుతూ, స్వాతంత్ర్య తర్వాత దేశాన్ని అంతా ఒక్కటి చేసిన వ్యక్తి పటేల్ అన్నారు. ఆయన చూపిన యూనిటీ స్ఫూర్తితో విభిన్న కులాలు,మతాలు,జాతుల వారందరూ ఒక్కటిగా జీవిస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలన్నారు. మేరా భారత్ ప్రకాశం జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి మాట్లాడుతూ యువతలో స్ఫూర్తి నింపే విధంగా ఈ యూనిటీ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. సర్దార్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఒక్కసారి నేటి యువతకు ఏక్తా భావాన్ని నింపే విధంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com